క్లుప్తంగా

బీక్యాతండా వాసికి డాక్టరేట్‌


డాక్టరేట్‌ అందుకుంటున్న బాణోతు వెంకట్‌

కోదాడరూరల్‌ : మండలంలోని బీక్యాతండాకు చెందిన బాణోతు సైదులు- రత్న కుమారుడు వెంకట్‌ సివిల్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో డాక్టరేట్‌ పొందాడు. 'ఇన్‌ఫ్లుయన్స్‌ ఆఫ్‌ పోర్‌ స్ట్రక్చర్‌ ఆన్‌ డ్యూరబిలిటీ ఆఫ్‌ పర్వియస్‌ కాంక్రీట్‌'అనే అంశంపై జేఎన్‌టీయూహెచ్‌ ప్రొఫెసర్‌ కె.మంజులావాణి పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు గాను మంగళవారం జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన 13వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ, యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, ఏఐసీటీఈ చైర్మన్‌ ప్రొఫెసర్‌ టీ.జీ సీతారాం చేతుల మీదుగా డాక్టరేట్‌ అందజేశారు. చిలుకూరు మండలంలోని మిట్స్‌ కళాశాలలో బీటెక్‌ సివిల్‌ ఇంజినీరింగ్‌ పూర్తిచేసిన వెంకట్‌ గత 10 సంవత్సరాలుగా అదే కళాశాలలో సివిల్‌ ఇంజినీరింగ్‌ విభాగానికి హెచ్‌ఓడీగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్‌ ప్రీతిరెడ్డి, వైస్‌ చైర్మన్‌ గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ కేశవరెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ నర్సిరెడ్డితో పాటు అధ్యాపకులు, తండా ప్రజలు వెంకట్‌ను అభినందించారు.

గెస్ట్‌ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మోతె : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్‌ కళాశాలలో బోధించుటకు గెస్ట్‌ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు, జూనియర్‌ కళాశాల ప్రత్యేకాధికారి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్‌)కోర్స్‌ విద్యార్థులకు బోధించడానికి ఎంఎస్సీ నర్సింగ్‌, బీఎస్సీ నర్సింగ్‌లో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంగ్లిష్‌ బోధనకు ఎంఏ, బీఈడీ, మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌కు ఎంఎస్సీ, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, ఎంఎల్‌టి అర్హత కలిగి ఉండాలని తెలిపారు. మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 5 నుంచి 9తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన లారీ ఓనర్‌ సయ్యద్‌ నన్నే సాహెబ్‌ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఆయన కుటుంబానికి చిలుకూరు లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు రూ.33 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడుడు షేక్‌ నన్నే సాయబ్‌, ప్రధాన కార్యదర్శి గన్నా ప్రసాద్‌, సభ్యులు వట్టికూటి వెంకటేశ్వర్లు, పెంచు సాహెబ్‌, బాలాగౌడ్‌, బెల్లంకొండ భద్రయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొండ హరీష్‌గౌడ్‌



హుజూర్‌నగర్‌ : భారతీయ జనతా పార్టీ హుజూర్‌నగర్‌ పట్టణ అధ్యక్షుడిగా కొండ హరీష్‌గౌడ్‌ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత ఉత్తర్వులు జారీ చేశారు. కొండ హరీష్‌గౌడ్‌ గతంలో ఆర్‌ఎస్‌ఎస్‌ ఫుల్‌ టైమర్‌గా, బీజేపీ ఖమ్మం, వరంగల్‌, హైదరాబాద్‌ పార్లమెంట్‌ల ఫుల్‌ టైమర్‌గా, సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం స్థానికంగా మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు చల్లా శ్రీలత, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు భాగ్యరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

గాయపడిన వ్యక్తికి లయన్స్‌ క్లబ్‌ చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

నేరేడుచర్ల : ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన నేరేడుచర్లలోని రాఘవేంద్రకాలనీకి చెందిన వెంకటాచారి కుటుంబానికి బుధవారం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో రూ. 5500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్‌ జోన్‌ చైర్మన్‌ చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి లయన్స్‌ క్లబ్‌ ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్‌ అధ్యక్షుడు జిలకర రామస్వామి, ప్రధాన కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కోశాధికారి ఎస్‌కెఎ యూసుఫ్‌, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, చిలకరాజు శ్రీను తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగుకు సమాయత్తం


వెంకట్రాంపురంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు


నారాయణపురం వద్ద వ్యవసాయ బావి తీస్తున్న దృశ్యం

- దుక్కులు దున్నే పనిలో రైతన్నలు
- వ్యవసాయ పొలాలకు పశువుల ఎరువు, చెరువుమట్టి తరలింపు

నడిగూడెం : మండల వ్యాప్తంగా రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇటీవల కొద్దిపాటి వర్షాలు కురవడంతో దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. పలువురు రైతులు తమ వ్యవసాయ భూములకు పశువుల పెంట, చెరువు మట్టి తోలుకుంటున్నారు. కొందరు వడ్రంగి వృత్తిదారుల వద్దకు వెళ్లి వ్యవసాయ పనిముట్లకు మరమ్మతులు చేయించుకుంటున్నారు. ముఖ్యంగా నాన్‌ఆయకట్టు గ్రామాలైన బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం, నారాయణపురం గ్రామాల్లో పత్తి, మిరప, కంది, పెసర పంటలు సాగు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంకా పలు గ్రామాల్లో రైతులు వరి సాగు చేపట్టేందుకు కొత్తగా బోర్లు వేయించుకుంటున్నారు. కొత్తగా వ్యవసాయ బావులు తీయించుకుంటున్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తేందుకు గాను గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఆయకట్టు గ్రామాలైన నడిగూడెం, చాకిరాల, శ్రీరంగాపురం, వల్లాపురం, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబెల్లి గ్రామాల్లో నాగార్జునసాగర్‌ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న కొమరబండ, కొత్తగూడెం, పాలారం మేజరు కాల్వలతో పాటు ఎల్‌- 34, ఎల్‌- 35, ఎల్‌- 36, ఆర్‌- 10 ఎత్తిపోతల పథకాల కింద వరి సాగుకు ఇప్పటికే తొలివిడతగా వేసవి దుక్కులు దున్నారు. పలు గ్రామాల రైతులు రాయితీపై ప్రభుత్వం నుంచి మంజూరైన జీలుగ విత్తనాలు కొనుగోలు చేసి చల్లారు. ఈ నెల 2వ వారం నుంచి నారు మడుల ఏర్పాటు పనులు చేసుకోనున్నారు.


బృందావనపురంలో పొలానికి పశువుల పెంట తరలిస్తున్న కూలీలు


నడిగూడెంలో వ్యవసాయ పనిముట్లకు మరమ్మతులు చేయించుకుంటున్న రైతులు

బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కోదాడరూరల్‌ : బక్రీద్‌ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోదాడ పట్టణ సీఐ శివశంకర్‌ అన్నారు. బుధవారం పట్టణంలో ముస్లిం మతపెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన పీస్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని అన్నారు. చట్టవిరుద్ధమైన పనులు చేయొద్దని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివశంకర్‌

వైభవంగా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్‌ : మండలంలోని లింగగిరిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం శ్రీసీతారామచంద్ర స్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వాముల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో గంగమ్మ జాతర


ముస్తాబైన గంగమ్మ దేవాలయం

చిలుకూరు : మండల కేంద్రంలోని బేతవోలు రోడ్డులో నిర్మించిన యాదవుల కులదైవం గంగమ్మ తల్లి దేవాలయం వద్ద ఈ నెల 8, 9 తేదీల్లో జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. కాగా, యాదవులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టపాక సత్యనారాయణ, కమిటీ సభ్యులు కోరారు.

వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

నేరేడుచర్ల : వరి పంటలో చీడపీడల ఉధృతిని తగ్గించడానికి సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ సీహెచ్‌.పద్మావతి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలం సోమారం గ్రామంలో జరిగిన వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరి పైరుకు ఆశించే దోమ, కాండం తొలుచు పురుగు, ఆకు ముడత, ఉల్లికోడ్‌, కంకినల్లి, అగ్గి తెగులు, ఎండాకు తెగులు, పొట్టుకుళ్లు నివారణకు యాజమాన్యం పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నరేష్‌, ఏఓ జావీద్‌, ఏఈవో నిర్మల, ఇఫ్‌కో మేనేజర్‌ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త పద్మావతి

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కళ్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్‌, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్‌, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, టెంపుల్‌ ఇన్‌స్పెక్టర్‌ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి


సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రిధికా ఇన్‌ హోటల్‌లో ఈ నెల 8న జరిగే సీపీఐ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య కోరారు. బుధవారం మండలంలోని గానుగబండ గ్రామంలో జిల్లా మహాసభల పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పోకల ఆంజనేయులు, షేక్‌ నబీసాహెబ్‌, పీరిసాహెబ్‌, సుభాని, ఏఐవైఎఫ్‌ మండల అధ్యక్షుడు పంగ సైదులు, ఈద మట్టయ్య, ఈదయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు రేషన్‌ కార్డులను వదులుకోవాలి

హుజూర్‌నగర్‌ : ప్రభుత్వ ఉద్యోగులు తమ రేషన్‌ కార్డులను వదులుకోవాలని తహసీల్దార్‌ నాగార్జున రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారు స్వచ్ఛందంగా తమ రేషన్‌ కార్డులను వదులుకోవాలని కోరారు. భార్యాభర్తలలో ఏ ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగస్తులైనా వారు రేషన్‌ కార్డును కలిగి ఉండకూడదని ఆయన తెలిపారు.

పోలీస్‌శాఖలో సేవలు అందించడం అభినందనీయం

సూర్యాపేటటౌన్‌ : కోదాడ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న అబ్దుల్‌ సత్తార్‌ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌ జిల్లా కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ హోంగార్డు సత్తార్‌ను సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. హోంగార్డుగా సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయమన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో 30సంవత్సరాల పాటు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ ఉద్యోగ విరమణ అనంతరం ప్రజాసేవలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్‌ డీఎస్పీ నరసింహాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం, వేణుగోపాలపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, బుధవారం ఎంపీడీఓ హరిసింగ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాలను, నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ కార్యాలయాల్లో రిజిస్టర్‌లను కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అన్వర్‌, తదితరులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్‌రూరల్‌ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని బూరుగడ్డలో నిర్వహించిన పోలీస్‌ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్లాడారు. యువకులు తెలిసి తెలియక తప్పులు చేయడంతో జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. చేసే ప్రతి పనిలో నిజాయితీతో ఉండి చదువుపై ఏకాగ్రత ఉంచాలని ఆయన తెలిపారు. ఒక్కసారి ఎద్దైన పోలీస్‌ కేసు నమోదు అయితే ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం కావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ రాధికాఅరుణ్‌కుమార్‌ దేశ్‌ముఖ్‌, మాజీ సర్పంచ్‌ అరుణ్‌కుమార్‌ దేశ్‌ముఖ్‌, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు హక్కు పట్టాలు అందించాలి

పాలకవీడు : జిల్లాలో అనేక ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న పోడు రైతులకు హక్కు పత్రాలు అందించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. బుధవారం పాలకవీడు మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పాలకవీడు, చింతలపాలెం మండలాలతో పాటు జిల్లాలో పోడు రైతులకు భూ పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. పోడు రైతులకు పట్టాలు అందిస్తామని ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. రెవెన్యూ సదస్సుల్లో పోడు రైతులను గుర్తించి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- అదనపు కలెక్టర్‌ రాంబాబు

మేళ్లచెరువు : భూసమస్యలపరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్‌ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని రేవూరు గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూసమస్యలు తెలుసుకునేందుకు గాను ఈ నెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తు అందజేస్తే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు.తహసీల్దార్‌ నూకల రాజేందర్‌ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రేషన్‌ దుకాణం తనిఖీ..

మండలంలోని రేవూరు, మేళ్లచెరువు గ్రామాల్లో రేషన్‌ దుకాణాలను అదనపు కలెక్టర్‌ రాంబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. రేషన్‌ కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీనివాస సాయి శివయ్య రైస్‌ మిల్లులో తనిఖీ చేశారు. ఆయన వెంట సీనియర్‌ అసిస్టెంట్‌ జానకిరామిరెడ్డి, ఆర్‌ఐలు మోషిన్‌బాబా, సుశీల, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్‌ : భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ వాజిద్‌అలీ అన్నారు. బుధవారం మండలంలోని రెడ్లకుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాధినేని అప్పారావు, మల్లెల పుల్లయ్య, కనగాల నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం

చిలుకూరు : భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్‌ ధృవకుమార్‌ అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని పాలెఅన్నారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఆర్‌ఐలు శ్వేత, మంత్రిప్రగడ సీత రామచందర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్లూరులో..

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని అడ్లూరు గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతులు 29 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సురేందర్‌ రెడ్డి, ఆర్‌ఐ వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.


మేళ్లచెరువు రేవూరులో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్‌ రాంబాబు, తదితరులు


కోదాడరూరల్‌ : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్‌ వాజిద్‌అలీ


నేరేడుచర్ల : ఎల్లారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్‌ సైదులు


చిలుకూరు : పాలెఅన్నారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్‌ ధృవకుమార్‌

ఎల్లారంలో..

నేరేడుచర్ల : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్‌ సురిగి సైదులు తెలిపారు. బుధవారం నేరేడుచర్ల మండలం ఎల్లారం గ్రామంలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌.. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సదస్సులో మొత్తం 13 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ మౌనిక ఉన్నారు.

175 దరఖాస్తుల స్వీకరణ

నడిగూడెం : మండలంలోని రామాపురంలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ రకాల భూ సమస్యలపై 175 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్‌ వి.సరిత తెలిపారు. ఇన్‌చార్జ్‌ ఆర్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సతీష్‌ మ్యూజిక్‌ అకాడమీ లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు, జానపద సామ్రాట్‌ అవార్డు గ్రహీత అమరవరపు సతీష్‌కు చెందిన సతీష్‌ మ్యూజిక్‌ అకాడమీ లోగోను బుధవారం రవీంద్ర భారతి కళాకారుల కళా నిలయం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ హరికృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమరవరపు సతీష్‌, కల్పన, స్వరూప, సుజాత, నాగమణి, రాణి, అపర్ణ, సలోమి, మరియమ్మ, ధనమ్మ, వీరబాబు, శోభన్‌, అనురాధ, ఉపేంద్ర, సునీత, శారదా, భువనేశ్వరి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


ఎకలాస్‌ఖాన్‌పేట వద్ద కొమరబండ మేజర్‌ కాల్వలో కంపచెట్లు తొలగిస్తున్న కూలీలు

నడిగూడెం : మండల వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీలు పంట కాల్వల పూడిక తీత, భూ అభివృద్ధి పనులు, మేజర్‌, మైనర్‌ కాల్వలకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయ 30వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు గురువారం ఒక్కరోజు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి మురళీధర్‌ బుధువారం తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. శ్రీ సంతోషిమాత అమ్మవారిని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతులు శ్రీ అభినవొద్దండ నృసింహ భారతి మహాస్వామి కరకమలములచే ప్రతిష్ఠించుకొని 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామూహికంగా కుంకుమార్చన, పసుపు కొమ్ముల పూజ, గాజుల పూజ, పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్‌రావు, ఉప కోశాధికారి కొత్త మల్లికార్జున్‌, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి సోమయ్య, కమిటీ సభ్యులు గోపారపు రాజు, మహంకాళి ఉపేందర్‌, దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణశర్మ, బచ్చు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ!


రోడ్డు కంటే ఎత్తులో నిర్మించిన కల్వర్టు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పలు వీధుల్లో మురుగు కాల్వలు లేక మురుగు రోడ్లపై పారుతోంది. ఓ చోట కల్వర్టు శిథిలమైంది. మరో చోట మురుగు కాల్వపై కల్వర్టు రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, కల్వర్టులను రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిర్మించాలని కోరుతున్నారు.

అడుగుకో గుంత.. రాకపోకలకు చింత


అధ్వానంగా వెంకట్రాంపురం కొత్తగూడెం రహదారి

నడిగూడెం : మండలంలోని కరివిరాల ఆవాస గ్రామం వెంకట్రాంపురం నుంచి కాగితరామచంద్రాపురం, మోతె మండలం కొత్తగూడెం, తుమ్మలపల్లి, మామిళ్లగూడెం గ్రామాలకు వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షాకాలంలో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డును కమ్మేశాయి. ఈ రహదారి మీదుగా నిత్యం అనేక మంది రైతులు వ్యవసాయ పొలాలకు రాకపోకలకు కొనసాగిస్తుంటారు. ఈ అంతర్గత రహదారిలో బీటీ రోడ్డు కోసం ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

బ్రిటిష్‌ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టడంలో ముఖ్యపాత్ర

సూర్యాపేట అర్బన్‌ : భారతదేశం నుంచి బ్రిటిష్‌ సామ్రాజవాదాన్ని తరిమికొట్టడంలో మహిళా సమఖ్య పాత్ర మరువలేనిదని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. బుధవారం భారత మహిళా సమాఖ్య 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలు మల్లేశ్వరి, కోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.